## నూతన చిన్న పీర్ల చౌడి ప్రారంభం

❖రూ. 7.50 లక్షల ఎస్‌డీఎఫ్ నిధులతో నిర్మాణం

❖హామీని నిలబెట్టుకున్న ఎమ్మెల్యే మేఘారెడ్డి



**దశ, పెబ్బేర్ :** 12వ వార్డు ప్రజల దశాబ్దాల కల నెరవేరింది. నియోజకవర్గ అభివృద్ధిలో భాగంగా ప్రభుత్వం ప్రత్యేక అభివృద్ధి నిధుల (ఎస్‌డీఎఫ్) ద్వారా మంజూరు చేసిన రూ.7.50 లక్షల వ్యయంతో నిర్మించిన నూతన చిన్న పీర్ల చౌడిని స్థానిక ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి, మున్సిపల్ చైర్మన్ అక్కి శ్రీనివాస్ గౌడ్ గురువారం ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రిబ్బన్ కత్తిరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మాట్లాడుతూ, ఎన్నికల సమయంలో స్థానిక ప్రజలకు ఇచ్చిన హామీని నెరవేర్చడం సంతోషంగా ఉందన్నారు. పీర్ల పండుగతో పాటు వివిధ సాంస్కృతిక, ఆధ్యాత్మిక కార్యక్రమాల నిర్వహణకు ఈ చౌడి ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. నియోజకవర్గ సమగ్ర అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తున్నామని, రాబోయే రోజుల్లో మరిన్ని నిధులు తీసుకువచ్చి ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలను కల్పిస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. చౌడి నిర్మాణానికి నిధులు మంజూరు చేసి, పనులను త్వరితగతిన పూర్తి చేయించిన ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డికి 12వ వార్డు ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ అక్కి శ్రీనివాస్ గౌడ్, మార్కెట్ కమిటీ చైర్మన్ ప్రమోదిని పాండేశ్వర్ రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ సుమిత్ర ఎల్లారెడ్డి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ విజయవర్ధన్ రెడ్డి, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రామ్ రెడ్డి, పట్టణ అధ్యక్షుడు దయాకర్ రెడ్డి, కౌన్సిలర్లు సౌజన్య, పర్వీన్ షకీల్, జములమ్మ, రంజిత్ కుమార్, బురమోని రాములు యాదవ్, వెంకటేష్ సాగర్, సురేందర్ గౌడ్, మార్కెట్ డైరెక్టర్ రామన్ గౌడ్, మోతె రాములు, రణధీర్ రెడ్డి, రజాక్, నరసింహ, మొహమ్మద్ బషీర్ తదితరులు పాల్గొన్నారు.

## సీసీ రోడ్ల అభివృద్ధికి ప్రాధాన్యం

❖బీజేపీ నేత, మాజీ ఎమ్మెల్యే కెఎస్ రత్నం

❖వార్డు అభివృద్ధికి కృషి చేస్తా : కౌన్సిలర్ పెద్దొళ్ల దయాకర్



**దశ, చేవెళ్ల:** చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి సీసీ రోడ్ల నిర్మాణానికి ప్రాధాన్యమిస్తున్నారని బీజేపీ నేత, మాజీ ఎమ్మెల్యే కెఎస్ రత్నం అన్నారు. గురువారం చేవెళ్ల మున్సిపల్ పరిధిలోని 10వ వార్డు రామన్న గూడలో ఎంపీ నిధులు రూ.10లక్షల వ్యయంతో నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులను ఆయన ఆ వార్డు బీజేపీ కౌన్సిలర్ పెద్దొళ్ల దయాకర్, స్థానిక బీజేపీ నాయకులతో కలిసి కొబ్బరికాయ కొట్టి ప్రారంభించి మాట్లాడారు. అభివృద్ధిలో భాగంగా మౌలిక వసతులను కల్పించేలా ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకుంటున్నారన్నారు. అనంతరం కౌన్సిలర్ పెద్దొళ్ల దయాకర్ మాట్లాడుతూ.. వార్డులోని ప్రతి సమస్యను దశలవారీగా పరిష్కారం చేసేందుకు అహర్నిశలు కృషి చేస్తానన్నారు. అభివృద్ధిలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ కౌన్సిలర్లు మనీషా అనంత్ రెడ్డి, మినాక్షి సత్యనారాయణ, బీజేపీ సీనియర్ నాయకులు ప్రభాకర్, అంజన్న, మాణిక్య రెడ్డి, బీజేపీ పట్టణ అధ్యక్షుడు అత్తెల్లి అనంత్ రెడ్డి, బీజేపీ, బీజీవైఎం నాయకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## నితిన్ నభీన్‌కు ఘనస్వాగతం పలకాలి

❖బీజేపీ పట్టణ అధ్యక్షుడు అత్తెల్లి అనంత్ రెడ్డి



**దశ, చేవెళ్ల :** భారతీయ జనతా పార్టీ జాతీయ అధ్యక్షులు నితిన్ నభీన్ ఈనెల 28న రంగారెడ్డి జిల్లా నూతన పార్టీ కార్యాలయం ప్రారంభానికి రానున్నన్నారని, ఆయనకు ఘనస్వాగతం పలకాలని బీజేపీ చేవెళ్ల పట్టణ అధ్యక్షుడు అత్తెల్లి అనంత్ రెడ్డి బీజేపీ నాయకులు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు. గురువారం చేవెళ్ల పట్టణంలో గల పార్టీ కార్యాలయంలో భారతీయ జనతా పార్టీ నూతన కార్యవర్గంతో సమావేశ కార్యక్రమం నిర్వహించారు. సమావేశ కార్యక్రమం అనంతరం నూతనంగా ఎన్నుకోబడిన చేవెళ్ల మున్సిపల్ కమిటీ సభ్యులను శాలువాలతో సన్మానించారు. వారిలో ప్రధాన కార్యదర్శులు పత్తి సత్యనారాయణ, చేగురి ప్రవీణ్ రెడ్డి, ఉపాధ్యక్షులు పెద్దోళ్ళ దయాకర్, పిసరి శ్రీకాంత్ రెడ్డి, కాసుల నాగరాజ్ గౌడ్, జి శివకుమార్ గౌడ్, కార్యదర్శులు గాజులగూడెం శ్రీనివాస్ రెడ్డ, ఎర్ర గోవర్ధన్, వడ్డే అమృత, శ్రీకాంత్ గౌడ్, కార్యవర్గ సభ్యులు నగేష్, సామ కృష్ణా రెడ్డి, చాకలి శ్రీనివాస్, రవి, కరుణాకర్, రమేష్ గౌడ్, పి.సంజీవ్ రెడ్డి, శేరి విజయలక్ష్మి, కె చంద్రశేఖర్ రెడ్డి, చంద్రయ్యలు కలరు. ఈ కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు ఆంజనేయులు గౌడ్, మాణిక్యారెడ్డి, శర్వలింగం, ఇంద్రసేనా రెడ్డి, అశోక్, చంద్రశేఖర్ రెడ్డి, కలెంల్ల మహేందర్, కృష్ణా రెడ్డి, అభిశేఖర్ రెడ్డి, పురషోత్తం రెడ్డి, రవి, సురేందర్ రెడ్డి, రామకృష్ణ, నరేష్, గణేశ్, జయసింహ రెడ్డి, జగదీశ్వర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఎమర్జెన్సీ నెవర్ అగైన్‌పై ఎబివిపి ఓయూ సెమినార్







**దశ, ఓయూ :** అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ ఉస్మానియా యూనివర్సిటీ శాఖ ఆధ్వర్యంలో (సంవిధాన్ హత్య దివస్) సందర్భంగా ఎమర్జెన్సీ నెవర్ అగైన్ అనే అంశంపై సెమినార్ నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఏబీవీపీ రాష్ట్ర అధ్యక్షులు డా. రావుల కృష్ణ, రాష్ట్ర ఆల్ యూనివర్సిటీస్ ప్రముఖ్ అశ్విన్ ఠాకూర్ జీ హాజరయ్యారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 1975 జూన్ 25న దేశంలో విధించిన ఎమర్జెన్సీ భారత ప్రజాస్వామ్య చరిత్రలో ఒక చీకటి అధ్యాయమని , ఎమర్జెన్సీ సమయంలో రాజ్యాంగ విలువలు, ప్రాథమిక హక్కులు, భావ ప్రకటనా స్వేచ్ఛ తీవ్రంగా దెబ్బతిన్నాయని అన్నారుఅలాగే, ఎమర్జెన్సీ కాలంలో వేలాది మంది సామాజిక కార్యకర్తలు, విద్యార్థి నాయకులు ఎటువంటి విచారణ లేకుండానే అరెస్టులకు గురయ్యారని పేర్కొన్నారు. పత్రికలపై సెన్సార్ విధించడం ద్వారా ప్రజలకు నిజమైన సమాచారాన్ని చేరకుండా చేశారని, ప్రభుత్వ విధానాలను ప్రశ్నించే హక్కును అణచివేశారని తెలిపారు. రాజ్యాంగంలోని ప్రాథమిక హక్కులను నిలిపివేయడం ద్వారా ప్రజాస్వామ్య వ్యవస్థకు తీవ్రమైన నష్టం కలిగిందన్నారు.. ప్రజాస్వామ్య వ్యవస్థను పరిరక్షించడం ప్రతి పౌరుడి బాధ్యత అని, ముఖ్యంగా విద్యార్థులు రాజ్యాంగ స్ఫూర్తిని అర్థం చేసుకొని ప్రజాస్వామ్య పరిరక్షణలో ముందుండాలని పిలుపునిచ్చారు.దేశంలో మరోసారి ఎమర్జెన్సీ వంటి పరిస్థితులు పునరావృతం కాకుండా ప్రజల్లో అవగాహన పెంపొందించాల్సిన అవసరం ఉందని తెలిపారు. విద్యార్థులు దేశ నిర్మాణంలో కీలక పాత్ర పోషించాలని, రాజ్యాంగ విలువలను కాపాడేందుకు కట్టుబడి ఉండాలని సూచించారు.ఈ కార్యక్రమంలో సిటీ సెక్రటరీ పృథ్వితేజ, స్టేట్ జాయింట్ సెక్రటరీ అలివేలి రాజు, విద్యానగర్ విభాగ్ కన్వీనర్ హరిప్రసాద్ ,జిల్లా కన్వీనర్ సాయి తేజ,స్టేట్ ఫార్మా విజన్ కన్వీనర్ రూప , సిటీ జాయింట్ సెక్రటరీ దినేష్, ఉస్మానియా యూనివర్సిటీ కార్యదర్శి మోక్షిత్, శివ, అభిషేక్,మరియు విద్యార్థులు పాల్గొన్నారు.




## సువర్ణాభరణాలతో మెరిసిన మోడల్స్

**దశ, హైదరాబాద్:** ప్రీమియం డిజైనర్ ఆభరణాల బ్రాండ్ సువర్ణం జ్యువెల్స్ హైదరాబాద్‌లో రెండో షోరూమ్‌ను బంజారాహిల్స్ రోడ్ నెం.10లో ప్రారంభించారు. ఈ ప్రారంభోత్సవంలో మోడల్స్ ఆభరణాలు ధరించి ప్రదర్శన చేశారు. మోడల్స్ ధరించిన బంగారపు డిజైన్లు సువర్ణం జ్యువెల్స్ వారి ప్రత్యేకతగా తెలిపారు. సువర్ణం జ్యువెల్స్‌లో బంగారం, వజ్రాలు, పోల్కీ, కుందన్ ఆభరణాల ప్రత్యేక కలెక్షన్లు అందుబాటులో ఉన్నాయని నిర్వాహకులు తెలిపారు. సంస్థ వ్యవస్థాపకుడు సిద్ధాంత్ నహార్ మాట్లాడుతూ.., "రెండో స్టోర్ ప్రారంభం కేవలం వ్యాపార విస్తరణ మాత్రమే కాదు. మా వినియోగదారులు, భాగస్వాములు మాపై ఉంచిన విశ్వాసానికి ఇది నిదర్శనం. వారి ఆదరణతోనే ఈ స్థాయికి చేరుకున్నాం. సంప్రదాయం, అందం, నాణ్యత కలగలిసిన ఆభరణాలను అందించేందుకు మరింత కృషి చేస్తాం" అని తెలిపారు.

# వడ్లకొండ దివ్యకు ఓయూ నుంచి డాక్టరేట్



**దశ, ఓయూ:** "సంక్షేమ రాష్ట్రంలో మహిళలు: అవగాహన, సవాళ్లు, ప్రభావాలు తెలంగాణ రాష్ట్రంలోని ఎంపిక చేసిన గ్రామీణ పట్టణ ప్రాంతాలపై ఒక అధ్యయనం." అనే అంశంపై ఉస్మానియా యూనివర్సిటీ సోషియాలజీ డిపార్ట్‌మెంట్ నుంచి డాక్టర్ రామ్ షెఫర్డ్ భీనవేణి పర్యవేక్షణలో పరిశోధన పూర్తి చేసినందుకుగాను వడ్లకొండ దివ్య కు ఓయూ పరీక్షల విభాగం డాక్టరేటును ప్రకటించింది. ఓయూ నుంచి బీఎస్సీ ఎంఈసి గ్రూపుతో బ్యాచిలర్ డిగ్రీ చదివిన దివ్య ఎం ఏ సోషియాలజీ కోర్సు పూర్తి చేసి గోల్డ్ మెడల్ సాధించింది. యు జి సి నెట్ పరీక్ష ద్వారా జే ఆర్ ఎఫ్ సాధించి ఫెలోషిప్ ద్వారా తన పీహెచ్డీని పూర్తి చేసింది. ప్రస్తుతం వడ్లకొండ దివ్య తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వానికి చెందిన మహిళా అభివృద్ధి మరియు శిశు సంక్షేమ శాఖలో విస్తరణ అధికారి (Extension Officer)గా పనిచేస్తున్నారు. ఈ పరిశోధన ద్వారా సంక్షేమ పథకాల అందుబాటు మరియు మహిళల నిజమైన సాధికారత మధ్య ఉన్న అంతరాన్ని సమగ్రంగా విశ్లేషించింది. ఈ పరిశోధనలో ఒక ముఖ్యమైన సైద్ధాంతిక ఆవిష్కరణగా "అన్‌కాన్షస్ ఎంపవర్‌మెంట్" (Un conscious Empowerment) అనే భావనను ప్రవేశపెట్టారు. దీని ప్రకారం, అనేక మంది మహిళలు పని చేయడం, సామాజిక కార్యక్రమాల్లో పాల్గొనడం, సంక్షేమ పథకాల ప్రయోజనాలను వినియోగించడం ద్వారా సాధికారతను పొందుతున్నప్పటికీ, తమను తాము సాధికారులుగా స్పష్టంగా గుర్తించకపోవడం జరుగుతోంది . ఈ పరిశోధన ఫలితాలు మహిళల సంక్షేమం మరియు సాధికారతకు సంబంధించిన విధాన రూపకల్పనలోనూ, భవిష్యత్ పరిశోధనలలోనూ ఉపయోగపడతాయని పరిశోధకులు భావిస్తున్నారు. జగిత్యాల జిల్లా మెట్ పల్లి పట్టణానికి చెందిన వడ్లకొండ స్నేహలత, వెంకట్ రావు దంపతుల కుమార్తె వడ్లకొండ దివ్య. ఓయూ నుంచి డాక్టరేట్ సాధించడం పట్ల బంధువులు, మిత్రులు వడ్లకొండ దివ్య ను అభినందించారు.

# మూసి కాలువ పరిధిలో భూ సమీకరణపై అధికారుల పరిశీలన



❖ రైతులతో సమావేశమై సూచనలు చేసిన అదనపు కలెక్టర్ చంద్రారెడ్డి.

**దశ, అబ్దుల్లాపూర్‌మెట్:** రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్‌మెట్ మండల పరిధిలోని బాచారం, గౌరెల్లి, తిమ్మాయిగూడ, కుత్బుల్లాపూర్, మర్రిపల్లి గ్రామాల్లో ముసి కాలువ ఆవరణలో ప్రతిపాదిత భూ సమీకరణ (ల్యాండ్ పూలింగ్) ప్రక్రియపై జిల్లా యంత్రాంగం క్షేత్రస్థాయిలో పరిశీలన నిర్వహించింది.

ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) శ్రీ కె. చంద్రారెడ్డి సంబంధిత ప్రాంతాలను సందర్శించి భూ సమీకరణకు అనువైన భూములను పరిశీలించారు. అనంతరం ఆయా గ్రామాల రైతులతో సమావేశమై ల్యాండ్ పూలింగ్ ప్రక్రియ, దాని ప్రయోజనాలు, ప్రభుత్వ విధానాలపై వివరించారు. రైతుల అభిప్రాయాలు, సందేహాలను తెలుసుకుని తగిన సూచనలు చేశారు.

ఈ కార్యక్రమంలో స్థానిక తహసీల్దార్ శ్రీ బి. సుదర్శన్‌రెడ్డి, మండల సర్వేయర్, మండల గిర్దావర్, గ్రామ పాలన అధికారులు పాల్గొన్నారు. భూ సమీకరణ ప్రక్రియ పారదర్శకంగా, రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని చేపట్టాలని అధికారులు పేర్కొన్నారు.

అలాగే ముసి కాలువ పరిసర ప్రాంతాల అభివృద్ధి, మౌలిక సదుపాయాల కల్పన, భవిష్యత్ పట్టణ విస్తరణ అవసరాల నేపథ్యంలో భూ సమీకరణకు సంబంధించిన అంశాలను రైతులకు వివరించారు. కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో రైతులు పాల్గొని తమ అభిప్రాయాలు, సూచనలను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు.



## ఇందిరా మహిళా శక్తి పథకం కింద మహిళలకు చీరల పంపిణీ

**దశ, పెద్ద అంబర్‌పేట్:** రాష్ట్ర ప్రభుత్వం మహిళల సంక్షేమం, సాధికారతకు ప్రాధాన్యత ఇస్తూ అమలు చేస్తున్న ఇందిరా మహిళా శక్తి పథకం కింద పెద్ద అంబర్‌పేట్ మున్సిపాలిటీ పరిధిలోని ఎస్ఎన్ఆర్ కాలనీలో మహిళా సంఘాల సభ్యులకు చీరల పంపిణీ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు.

ఈ కార్యక్రమానికి ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మహిళలకు చీరలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళా సంఘాల అభివృద్ధి, ఆర్థిక స్వావలంబన కోసం ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందని తెలిపారు. మహిళలు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకుని కుటుంబాలతో పాటు సమాజాభివృద్ధిలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

కార్యక్రమంలో నాగోల్ సర్కిల్11 డిప్యూటీ కమిషనర్ పి. సంపత్ కుమార్, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, రెసిడెంట్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు, మహిళా సంఘాల సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

జ్వాల
దశ
నిజం.. నిర్భయంగా..
శుక్రవారం
26-06-2026

# ఖమ్మం-భద్రాద్రి కొత్తగూడెం జిల్లా

ఖమ్మం వైరా | సత్తుపల్లి | పాడేరు | మధిర
భద్రాద్రి కొత్తగూడెం కొత్తగూడెం | ఇల్లందు | పినపాక | భద్రాచలం | అశ్వరావుపేట
WWW.DASHANEWS.COM




## విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

❖ డీఎస్పీ రవీందర్ రెడ్డి




**దశ, పినపాక :** యువత మత్తు పదార్థాలు, డ్రగ్స్ వంటి సామాజిక దురాచారాలకు దూరంగా ఉండి విద్యపై దృష్టి సారించి ఉన్నత భవిష్యత్తును నిర్మించుకోవాలని మణుగూరు డీఎస్పీ రవీందర్ రెడ్డి సూచించారు. గురువారం పినపాకలోని శ్రీవిద్య జూనియర్ కళాశాలలో డీఎస్పీ రవీందర్ రెడ్డి ఆధ్వర్యంలో ఆంటీడ్రగ్ అవేర్‌నెస్ ప్రోగ్రామ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మత్తు పదార్థాల వినియోగం వ్యక్తిగత జీవితానికే కాకుండా కుటుంబం, సమాజం, దేశ భవిష్యత్తుపై కూడా తీవ్ర ప్రభావం చూపుతుందని పేర్కొన్నారు. విద్యార్థులు చెడు వ్యసనాలకు దూరంగా ఉంటూ విద్యాభ్యాసంపై పూర్తి స్థాయిలో దృష్టి సారించి తమ లక్ష్యాలను సాధించేందుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. డ్రగ్స్, గంజాయి తదితర మత్తు పదార్థాల విక్రయాలు, రవాణా లేదా వినియోగానికి సంబంధించి ఎలాంటి సమాచారం తెలిసినా వెంటనే పోలీసులకు తెలియజేయాలని కోరారు.

## వీధి కుక్కల దాడిలో మూడు గొర్రెల మృతి



**దశ,పినపాక:** మండలంలోని గోపాలరావుపేట గ్రామంలో వీధి కుక్కల దాడిలో మూడు గొర్రెలు మృతి చెందగా, మరో ఐదు గొర్రెలు గాయపడిన ఘటన గురువారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన గొర్రెల కాపరి బండగొర్ల సంతోష్‌కు చెందిన గొర్రెల మందపై అరడజను వీధి కుక్కలు ఒక్కసారిగా దాడి చేశాయి. కుక్కల దాడిలో మూడు గొర్రెలు అక్కడికక్కడే మృతి చెందగా, మరో ఐదు గొర్రెలు తీవ్రంగా గాయపడ్డాయి. ఈ ఘటనతో తనకు సుమారు రూ.30 వేల నుంచి రూ.40 వేల వరకు ఆర్థిక నష్టం వాటిల్లిందని బాధితుడు సంతోష్ తెలిపారు. జీవనాధారమైన గొర్రెలను కోల్పోవడంతో కుటుంబం ఇబ్బందులు ఎదుర్కొంటోందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం స్పందించి తనకు తగిన పరిహారం అందించి ఆదుకోవాలని బాధితుడు విజ్ఞప్తి చేశాడు. గ్రామంలో వీధి కుక్కల బెడద రోజురోజుకు పెరుగుతోందని, వాటి నియంత్రణకు అధికారులు చర్యలు చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.

## జిల్లాలో ముగ్గురు ఎఫ్‌డీవోల నియామకం

**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బ్యూరో :** జిల్లా అటవీ శాఖలో పరిపాలనాపరమైన కారణాలతో ముగ్గురు అసిస్టెంట్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్స్ (ఏసీఎఫ్) అధికారులను వివిధ అటవీ డివిజన్లలో తాత్కాలికంగా ఫారెస్ట్ డివిజనల్ ఆఫీసర్లుగా (ఎఫ్‌డీవోలు) నియమిస్తూ ప్రధాన అటవీ సంరక్షణాధికారి డా. సి. సువర్ణ ఉత్తర్వులు జారీ చేశారు. ఉత్తర్వుల ప్రకారం యు. కోటేశ్వరావును భద్రాచలం అటవీ డివిజన్ ఎఫ్‌డీవోగా, వి. మంజులను కొత్తగూడెం అటవీ డివిజన్ ఎఫ్‌డీవోగా, కృష్ణ ప్రసాద్‌ను పాల్వంచ అటవీ డివిజన్ ఎఫ్‌డీవోగా నియమించినట్లు అటవీ శాఖ అధికారులు వెల్లడించారు. పరిపాలనా అవసరాల దృష్ట్యా ఈ నియామకాలు చేపట్టినట్లు అధికారులు తెలిపారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన అధికారులు సంబంధిత డివిజన్లలో అటవీ సంరక్షణ, అభివృద్ధి కార్యక్రమాల నిర్వహణను పర్యవేక్షించనున్నారు.

## జీఎం కార్యాలయం ఎదుట అధికారుల నిరసన




**దశ,మణుగూరు:** వేతన పెంపుదల అమలు, పెర్ఫార్మెన్స్ రిలేటెడ్ పే (పీఆర్‌పీ) చెల్లింపు తదితర డిమాండ్ల సాధన కోసం కోల్ మైన్స్ ఆఫీసర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (సీఎంఓఏఐ) మణుగూరు ఏరియా ఆధ్వర్యంలో అధికారులు గురువారం జీఎం కార్యాలయం ఎదుట నిరసన చేపట్టారు. నల్ల బ్యాడ్జీలు ధరించి, ప్లకార్డులు ప్రదర్శిస్తూ తమ ఆందోళనను వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు మాట్లాడుతూ, రెండేళ్లుగా పెండింగ్‌లో ఉన్న పీఆర్పీ బకాయిలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. 2017 వేతన సవరణ వల్ల ఏర్పడిన నష్టాన్ని సవరించడంతో పాటు, కోల్ ఇండియాలో అమలవుతున్న పే అప్‌గ్రేడ్ విధానాన్ని సింగరేణిలో కూడా అమలు చేయాలని కోరారు. సంస్థ అభివృద్ధి, ఉత్పాదకత పెంపులో అధికారులు కీలక పాత్ర పోషిస్తున్నప్పటికీ, వారి సమస్యల పరిష్కారంలో యాజమాన్యం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. తమ న్యాయమైన డిమాండ్లపై సానుకూల నిర్ణయం తీసుకునే వరకు దశలవారీగా వివిధ రూపాల్లో నిరసన కార్యక్రమాలు కొనసాగిస్తామని హెచ్చరించారు. అధికారుల సమస్యలను వెంటనే పరిష్కరించి, పెండింగ్ అంశాలపై స్పష్టమైన హామీ ఇవ్వాలని సింగరేణి యాజమాన్యాన్ని వారు కోరారు. ఈ కార్యక్రమంలో మణుగూరు ఏరియాకు చెందిన పలువురు అధికారులు పాల్గొన్నారు.

# ఇసుక కొత్త పాలసీలో అక్రమాలకు తావులేదు

❖ గిరిజన కుటుంబాలకు ఇసుక సొసైటీలతో ఉపాధి
❖ రేసింగ్ కాంట్రాక్టర్ అడబాల శ్రీకర్



**దశ,మణుగూరు:** ప్రస్తుతం అమలులో ఉన్న ఇసుక పాలసీలో అక్రమాలకు తావులేదని, ఇసుక రీచ్‌లపై నిరాధార ఆరోపణలు, చెడు ప్రచారాలు చేసి గిరిజనుల ఉపాధిని దెబ్బతీయవద్దని శ్రీకర్ విజ్ఞప్తి చేశారు. గురువారం ఆయన మణుగూరు డివి ఫంక్షన్ హాల్ లో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ,,,, మణుగూరు సబ్‌డివిజన్ పరిధిలో అమలవుతున్న ఇసుక పాలసీ పారదర్శకంగా కొనసాగుతోందన్నారు. ఇసుక రీచ్‌ల నిర్వహణ ద్వారా అనేక మంది గిరిజన కుటుంబాలకు ఉపాధి లభిస్తోందని, వారి ఆర్థిక పరిస్థితులు మెరుగుపడుతున్నాయని తెలిపారు. ఇసుక రీచ్‌లపై వాస్తవాలు తెలుసుకోకుండా తప్పుడు ప్రచారాలు చేయడం వల్ల గిరిజనుల జీవనోపాధిపై ప్రతికూల ప్రభావం పడే అవకాశం ఉందన్నారు. గిరిజనుల సంక్షేమం, ఉపాధి పరిరక్షణను దృష్టిలో ఉంచుకుని బాధ్యతాయుతంగా వ్యవహరించాలని అన్నారు . ప్రభుత్వం రూపొందించిన నిబంధనల మేరకు ఇసుక తవ్వకాలు, రవాణా జరుగుతున్నాయని, అక్రమాలకు అవకాశం లేకుండా సంబంధిత అధికారులు పర్యవేక్షణ నిర్వహిస్తున్నారని తెలిపారు. గిరిజనుల అభివృద్ధికి దోహదపడుతున్న ఇసుక రీచ్‌లపై అనవసర వివాదాలు సృష్టించకుండా సహకరించాలని ఆయన పిలుపునిచ్చారు. కావాలనే కొంతమంది గిట్టని వాళ్లు కొన్ని పత్రికల్లో రాపిస్తున్నారని అన్నారు. ఇసుక సొసైటీల వల్ల ఎంతోమంది ఏజెన్సీ గిరిజనులు లబ్ధి పొందుతున్నారని ఉపాధి కూడా కలుగుతుందని అన్నారు. కొంతమంది కావాలనే గిరిజనుల మధ్య చిచ్చులు పెట్టే ప్రయత్నాలు చేస్తున్నారని ఈ సరైన పద్ధతి కాదని అన్నారు. వాస్తవాలు పత్రికలలో వార్తలు రాయడం సరైన పద్ధతి కాదని అన్నారు. గిరిజనుల యొక్క మనోభావాలను దెబ్బతీయొద్దని ఇసుక సొసైటీలపై అసత్య ప్రచారాలు చేస్తే సహించేది లేదని అన్నారు.



## సామర్లకోట గ్రామంలో బోర్‌వెల్ శంకుస్థాపన

**దశ,పినపాక :** మండలంలోని అమరారం గ్రామపంచాయతీ పరిధిలోని సామర్లకోట గ్రామంలో బోర్‌వెల్ నిర్మాణ పనులకు గురువారం శంకుస్థాపన నిర్వహించారు. పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు ఆదేశాల మేరకు అమరారం సర్పంచ్ కొట్టెం శోభారాణి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి పినపాక మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, భద్రాద్రి డీసీసీ ఉపాధ్యక్షుడు గోడిశాల రామనాథం ముఖ్య అతిథిగా హాజరై శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొన్నారు. గ్రామ ప్రజలకు తాగునీటి సమస్యలు లేకుండా అవసరమైన మౌలిక వసతులను కల్పించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని ఈ సందర్భంగా నాయకులు పేర్కొన్నారు. గ్రామాభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ రేగ సత్యనారాయణ, వార్డు సభ్యులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు కొమరం లాలయ్య, పాయం భాస్కర్, మార్త మనోజ్ తదితరులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## విద్యుత్ రంగ ప్రైవేటీకరణను ఐక్య ఉద్యమాలతో అడ్డుకోవాలి: టీజీపీఈజేఏసీ




**దశ,మణుగూరు:** విద్యుత్ రంగంలో ప్రైవేటీకరణ విధానాలను ఐక్య ఉద్యమాలతో అడ్డుకోవాలని తెలంగాణ పవర్ ఎంప్లాయీస్ జాయింట్ యాక్షన్ కమిటీ పిలుపునిచ్చింది. దామరచర్లలోని వైటీపీఎస్ పవర్ ప్లాంట్లోని సీహెచ్‌పీ , ఏహెచ్‌పీ విభాగాల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా టీజీపీఈజేఏసీ ఆధ్వర్యంలో చేపట్టిన ఆందోళన కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా బీటీపీఎస్ వద్ద ఉద్యోగులు, కార్మికులు గురువారం ఆరో రోజు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా జేఏసీ నాయకులు మాట్లాడుతూ, ప్రభుత్వ రంగ విద్యుత్ సంస్థలను బలోపేతం చేయాల్సిన అవసరం ఉన్న సమయంలో ప్రైవేటీకరణ చర్యలు ఉద్యోగుల భద్రతతో పాటు ప్రజలకు అందుతున్న సేవలపై కూడా ప్రతికూల ప్రభావం చూపే అవకాశం ఉందన్నారు. విద్యుత్ రంగాన్ని కాపాడేందుకు ఉద్యోగులు, కార్మికులు, ప్రజా సంఘాలు ఐక్యంగా పోరాడాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ప్రైవేటీకరణ నిర్ణయాలను ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ, తమ న్యాయమైన డిమాండ్లు నెరవేరే వరకు ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ ధర్నాలో ఉద్యోగులు, కార్మికులు, జేఏసీ నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రైవేటీకరణ వ్యతిరేక నినాదాలు చేశారు.




## పీకేఓసీ డిప్‌సైడ్ బ్లాక్‌ను సింగరేణికే కేటాయించాలి: ఏఐటీయూసీ


**దశ,మణుగూరు:** మణుగూరు ఏరియాలోని పీకేఓసీ-2 గనిలో కార్మికులు గురువారం ఆందోళన చేపట్టి, పీకేఓసీ డిప్‌సైడ్ బ్లాక్‌ను బేషరతుగా సింగరేణి సంస్థకే కేటాయించాలని డిమాండ్ చేశారు. నిరసన కార్యక్రమంలో కార్మికులు నినాదాలతో గనిప్రాంతాన్ని హోరెత్తించారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి వై.రామ్‌గోపాల్ మాట్లాడుతూ, మణుగూరు ఏరియా మనుగడకు, సింగరేణి సంస్థ భవిష్యత్తుకు పీకేఓసీ డిప్‌సైడ్ బ్లాక్ అత్యంత కీలకమైందని పేర్కొన్నారు. ఈ బ్లాక్‌ను ప్రైవేటు సంస్థలకు కేటాయిస్తే మణుగూరు ఏరియాలో పనిచేస్తున్న సుమారు 2,400 మంది సింగరేణి కార్మికులు, 3,000 మందికిపైగా కాంట్రాక్ట్ కార్మికుల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. మణుగూరు ఏరియా 1/70 చట్ట పరిధిలో ఉన్నందున ప్రభుత్వ రంగ సంస్థలు మినహా ప్రైవేటు సంస్థలకు గనులను కేటాయించడం చట్ట విరుద్ధమని ఆయన అన్నారు. కార్మికుల మనోభావాలకు వ్యతిరేకంగా ప్రైవేటీకరణకు అనుమతిస్తే, కార్మికులందరినీ ఏకం చేసి పెద్దఎత్తున ఉద్యమాలు చేపట్టేందుకు సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) సిద్ధంగా ఉందని హెచ్చరించారు. ఈ నిరసన కార్యక్రమంలో జానకీ ప్రసాద్, నాగుల సతీష్ కుమార్, రవి, రమేష్‌తో పాటు పీకేఓసీ-2 కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# అనర్హులకు పింఛన్లు.. అర్హులు ఎదురుచూపులు

❖ సామాజిక భద్రతా పథకాల అమలుపై పెరుగుతున్న విమర్శలు

**దశ,పినపాక :** ప్రభుత్వ సామాజిక భద్రతా పింఛన్ల పంపిణీ విధానంపై జిల్లాలోని పలు గ్రామాల్లో తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. అర్హులైన వృద్ధులు, వితంతువులు, వికలాంగులు, ఒంటరి మహిళలు పింఛన్ల కోసం నెలల తరబడి ఎదురుచూస్తుండగా, కొందరు అనర్హులకు పింఛన్లు మంజూరవుతున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

గ్రామస్థుల కథనం ప్రకారం, ఆర్థికంగా బలంగా ఉన్న కుటుంబాలకు చెందిన కొందరు వ్యక్తులు, ఇతర ఆదాయ వనరులు కలిగి ఉన్న వారు కూడా ప్రభుత్వ పింఛన్లు పొందుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. మరోవైపు నిజంగా పేదరికంలో జీవిస్తున్న పలువురు అర్హులు దరఖాస్తులు చేసినప్పటికీ పథకం ప్రయోజనాలకు నోచుకోవడం లేదని వాపోతున్నారు.




కొన్నిప్రాంతాల్లోపింఛన్‌లబ్ధిదారులఎంపికలో పారదర్శకత లోపించిందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. క్షేత్రస్థాయి విచారణలు సక్రమంగా జరగకపోవడం, పాత జాబితాలను ఆధారంగా తీసుకోవడం వల్ల అనర్హులు కొనసాగుతున్నారని స్థానికులు పేర్కొంటున్నారు. అలాగే, కుటుంబ ఆర్థిక పరిస్థితుల్లో మార్పులు వచ్చినప్పటికీ కొందరి పేర్లు ఇంకా పింఛన్ జాబితాల్లో కొనసాగుతున్నట్లు సమాచారం. దీంతో నిజంగా అవసరమైన వారికి అవకాశాలు దూరమవుతున్నాయని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అర్హుల జాబితాను గ్రామ సభల ద్వారా పునఃసమీక్షించాలని, ప్రతి లబ్ధిదారుడి అర్హతలను మళ్లీ పరిశీలించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. పింఛన్ల మంజూరులో ఎలాంటి రాజకీయ లేదా వ్యక్తిగత సిఫార్సులకు తావులేకుండా పారదర్శక విధానాన్ని అమలు చేయాలని కోరుతున్నారు.

ఈ అంశంపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించి, అనర్హులను గుర్తించి జాబితా నుంచి తొలగించడంతో పాటు అర్హులైన పేదలకు వెంటనే పింఛన్లు మంజూరు చేయాలని సామాజిక సంఘాలు విజ్ఞప్తి చేస్తున్నాయి. సంక్షేమ పథకాల అసలు లక్ష్యం నిరుపేదలకు ఆర్థిక భరోసా కల్పించడమేనని, అందువల్ల లబ్ధిదారుల ఎంపికలో కఠిన ప్రమాణాలు పాటించాలని ప్రజలు అభిప్రాయపడుతున్నారు. పింఛన్ వ్యవస్థపై వస్తున్న ఫిర్యాదుల నేపథ్యంలో జిల్లా యంత్రాంగం సమగ్ర విచారణ చేపట్టి వాస్తవాలను వెలికితీయాల్సిన అవసరం ఉందని స్థానికులు కోరుతున్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ పథకాల ప్రయోజనాలు అందేలా చర్యలు తీసుకుంటేనే ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలపై ప్రజల్లో విశ్వాసం మరింత పెరుగుతుందని సామాజిక వర్గాలు పేర్కొంటున్నాయి.